అదనపు వసతులతో..



శిక్షణ, ఉపాధి కల్పన కార్యాలయం

- ఏయూలో సరికొత్తగా శిక్షణ, ఉపాధి కార్యాలయం
- ఇంటర్వ్యూ క్యాబిన్స్, సెమినార్ హాల్ ఏర్పాటు
- నేడు వీసీ ప్రసాదరెడ్డితో ప్రారంభోత్సవం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల శిక్షణ, ఉపాధి కల్పన కార్యాలయం అధునాతన వసతులతో సరికొత్తగా దర్శనమివ్వనుంది. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా, పెరుగుతున్న ప్లేస్‌మెంట్స్ నేపథ్యంలో అదనపు వసతులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సౌకర్యాలను శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించనున్నారు.

పూర్వ విద్యార్థుల సహాయం

ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించి ఉన్నతంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు వర్సిటీకి పెద్ద సంపదగా నిలుస్తున్నారు. వర్సిటీకి సంపూర్ణ సహకారం అందించానికి ముందుకొస్తున్నారు. 1983–87 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు దాదాపు రూ.5 లక్షల వ్యయంతో ప్లేస్‌మెంట్ కార్యాలయంలో అదనపు వసతులు సమకూర్చారు. కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో మొక్కలను పెంచుతూ హరితవనంగా తీర్చిదిద్దారు.

సుందరంగా కాన్ఫరెన్స్ హాల్

కార్యాలయం భవనం కింది అంతస్తులో కొత్తగా కాన్ఫరెన్స్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇంటర్వ్యూకి ముందుగా నిర్వహించే గ్రూప్ డిస్కషన్ వంటివి నిర్వహణకు వీలుగా దీనిని తీర్చిదిద్దారు. భవనం మొదటి అంతస్తులో సెమినార్ హాల్‌ను ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులకు వినియోగిస్తారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఇన్వెర్టర్ సదుపాయం, టెలివిజన్ ఏర్పాటు చేశారు.



సమావేశ మందిరం

4 ఇంటర్వ్యూ క్యాబిన్స్ ఏర్పాటు



నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్వ్యూ క్యాబిన్స్

ఇటీవల కాలంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాలను పదుల సంఖ్యలో ఉద్యోగ నియామక సంస్థలు సందర్శించాయి. గతేడాది 1500 మందికిపైగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు సైతం లభించాయి. ఈ నేపథ్యంలో ఇంటర్వ్యూ క్యాబిన్స్, అదనపు వసతుల అవసరం పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న కార్యాలయంలో కొత్తగా 4 ఇంటర్వ్యూ క్యాబిన్స్‌ని నిర్మించారు. ఒకే పర్యాయం ఎక్కువ మంది విద్యార్థులకు, త్వరితగతిన ఇంటర్వ్యూల నిర్వహణకు ఇవి దోహదపడనున్నాయి.

చంద్రయాన్–3 విజయోత్సవం



శివలింగం వద్ద డప్పు వాయిస్తూ వేడుక జరుపుకొంటున్న విద్యార్థులు

ఆరిలోవ: భారత శాస్త్రవేత్తలు చేపట్టిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జోడుగుళ్లపాలెం వద్ద నాగ క్షేత్రంలో విజయోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని శివలింగం వద్ద జాతీయ జెండాలు ఏర్పాటు చేసి విశాలాక్షినగర్ బీవీకే పాఠశాల విద్యార్థులతో కలసి జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఆలపించిన దేశ భక్తి గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నాగక్షేత్రం స్వామీజీ యోగి ప్రభాకర్‌జీ, ఆడారి కిశోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంతర కళాశాల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న అయ్యంగారి ఆనంద్, తదితరులు

ఎంవీపీ కాలనీ: ప్రతిభా–2023 అంతర్ కళాశాలల పోటీల్లో ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పలు పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రజని, డైరెక్టర్ ఆచార్య అయ్యంగారి ఆనంద్ మాట్లాడుతూ సంస్కృతం, తెలుగు, హిందీ వ్యాస రచన పోటీల్లో కళాశాల విద్యార్థులు కనకమహాలక్ష్మి, అంబటి మాధురి, విక్రమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఇంగ్లిష్ వ్యాసరచనలో ఎస్.సూర్యదీపక్‌కు ద్వితీయ, ఎస్.జ్యోతికకు తృతీయ బహుమతి లభించిందన్నారు. పోస్టర్ మేకింగ్‌లో ఆశాకుమారి తృతీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు.

క్లుప్తంగా

21వ వార్డులో ఎమ్మెల్సీ వంశీకృష్ణ పర్యటన



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

బీచ్ రోడ్డు: కార్పొరేషన్ ఎన్నికల సమయంలో 21వ వార్డులో ఇచ్చిన హామీల్లో 90 శాతం పూర్తి చేసినట్టు ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన 21వ వార్డులో పర్యటించారు. చినవాల్తేరు నుంచి సీబీఐ కార్యాలయం వరకు జరుగుతున్న తారు రోడ్డు పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వార్డులో ఇంకా రోడ్డు సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని జీవీఎంసీ అధికారులకు ఆయన సూచించారు. ఈ పర్యటనలో డీఈ ప్రసాద్, ఏఈ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో ఆర్టీసీ పార్సిల్ కౌంటర్



పార్సిల్ కౌంటర్ వద్ద ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

బీచ్ రోడ్డు: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నట్లు సంస్థ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వాల్తేరు డిపో ఆధ్వర్యంలో సిరిపురంలోని 900కే బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్సిల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ, మద్దిలపాలెం కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో పార్సిల్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో పార్సిల్స్‌ను ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అనధికారక దుకాణం సీజ్



దుకాణానికి తాళం వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు పరిధిలో జీవీఎంసీ అరకు కాఫీ షాపు పక్కనే అనధికారకంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని గురువారం సీజ్ చేశారు. స్థానిక అపార్ట్‌మెంట్‌వాసులు ఫిర్యాదు చేయడంతో స్థానిక కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి, ఏసీపీ శాస్త్రి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ స్వయంగా పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో దుకాణాన్ని నిర్వహిస్తుండడాన్ని గమనించి, మూసి వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు దుకాణానికి తాళం వేశారు.

యువకుడి ఆత్మహత్య

మద్రిపాలెం: ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాడేరుకు చెందిన కృష్ణారావు(25) అనే యువకుడు కంచరపాలెం అరుంధతినగర్‌లోని తన బంధువుల ఇంట్లో నివసిస్తున్నాడు. నగరంలోని సిరిపురంలో గల ఓ వస్త్రాల దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి తల్లిదండ్రులు పాడేరులో నివసిస్తున్నారు. మృతుడి బంధువు కె.భాగ్యవతి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. శుక్రవారం పోస్ట్‌మార్టం జరుగుతుందని పోలీసులు తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిస్థాయి దర్యాప్తులో తెలియాల్సి ఉందని చెప్పారు.

యథేచ్ఛగా పశువుల సంచారం



సంక్షేమ భవన్ కూడలిలో రాత్రిపూట సంచరిస్తున్న చేస్తున్న పశువులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలో పశువుల సంచారం యథేచ్ఛగా సాగుతోంది. కాలనీలోని సెక్టార్–9లో పశువుల బెడద ఎక్కువగా ఉంది. కాలనీలో పెద్ద ఎత్తున సంచరిస్తున్న పశువులు రాత్రి పూట డస్ట్‌బిన్‌ల వద్దకు చేరి చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పశువుల బెడదపై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ వెటర్నరీ విభాగ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఆయా పశువుల యజమానులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాత్రి పూట పశువులను రోడ్లపైనే వదిలేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ క్లస్టర్–2 ఇన్‌చార్జిగా జగదీష్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గం క్లస్టర్–2 ఇన్‌చార్జిగా ఆ పార్టీ నాయకుడు పీలా ప్రేమ్‌కిరణ్ జగదీష్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గురువారం క్లస్టర్ నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా 17వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రేమ్‌కిరణ్ జగదీష్‌ను నియోజకవర్గం పరిధి 9, 17, 18, 19 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. జగదీష్‌కు ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు.

మారథాన్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ



వంశీకృష్ణను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: దేశ స్వాతంత్ర్యానికి 76 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ నెల 14న వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ నిర్వహించిన 76 కిలోమీటర్ల ఆల్ట్రా మారథాన్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థి కె.వంశీకృష్ణ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా గురువారం వంశీకృష్ణను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. రేసులో నలుగురు క్రీడాకారులు పాల్గొనగా బుల్లయ్య కళాశాలలో బీఎస్సీ సెకండియర్ చదువుతున్న వంశీకృష్ణ పాల్గొన్నాడు. 14వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నోవాటెల్ వద్ద మారథాన్ ప్రారంభించి 15వ తేదీ ఉదయం 5 గంటలకు ముగించారు. వైజాగ్ రన్నింగ్ అసోసియేషన్ వంశీకృష్ణకు జ్ఞాపిక బహూకరించింది. ఈ సందర్భంగా వంశీకృష్ణకు కళాశాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

ప్రేమించి.. పెళ్లికి నిరాకరించిన యువకుడి అరెస్ట్

మద్రిపాలెం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌కు చెందిన దిలీప్‌కుమార్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన పి.వందన అనే యువతిని ప్రేమించాడు. పెళ్లి కూడా చేసుకుంటానన్నాడు. వారి ప్రేమను యువతి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. యువకుడి తల్లిదండ్రులు మాత్రం ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో దిలీప్‌కుమార్ పెళ్లికి నిరాకరించడంతో వందన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో కేసు నమోదు చేశారు. సదరు యువకుడిని గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించారు.

మార్కెట్లకు శ్రావణ శోభ

- నేడు రెండో శుక్రవారం పూజలు
- ఆకాశాన్నంటిన పూజా సామగ్రి ధరలు

ఏయూ క్యాంపస్: శ్రావణమాసంలో మహాలక్ష్మి అమ్మవారిని కొలిచే రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం ఆచరణకు అంతా సమాయత్తం అయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలకు శ్రావణశోభ సంతరించుకున్నాయి. ఇప్పటికే ఆలయ ప్రాంగణాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల దర్శనానికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు, అధికారులు చేపట్టారు. పెదవాల్తేరులో కొలువైన పోలమాంబ ఆలయంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.గాయత్రి తెలిపారు.

పెరిగిన పూజా సామగ్రి ధరలు

పువ్వుల ధరలు విపరీతంగా పెరిగాయి. హైబ్రిడ్ చామంతి, దేశవాళీ చామంతి పువ్వులు కేజీ రూ.500, దండ రూ.50కి, హైబ్రీడ్ గులాబీలు కేజీ రూ.450, బంతి పువ్వుల దండలు రూ.45 నుంచి రూ.50, మల్లె పువ్వులు కిలో రూ.450కి, మూర రూ.100, కనకాంబరాలు కిలో రూ.1000, మూర రూ.100, విరజాజులు మూర రూ.80కి, కిలో రూ.250 విక్రయించారు. గురువారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో వినియోగదారులు రైతుబజార్‌లో పువ్వులు కొనుగోలు చేయడానికి వచ్చారు. వీటితో పాటు కొబ్బరి కాయలు, అరటి పండ్లు, మామిడి కొమ్మలు, అరటి మొక్కలు వంటివి విక్రయించారు. వీటి ధరలు కూడా కాస్త అధికంగానే ఉన్నాయి.

రైతుబజార్ కిటకిట

ఆరిలోవ: శ్రావణ మాసం రెండో శుక్రవారం పూజా సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన వినియోగదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఆరిలోవ ప్రాంతంలో బజార్లతో పాటు ఎంవీపీ రైతుబజార్‌లో గురువారం సాయంత్రం పూల దుకాణాల వద్ద ఇసుకేస్తే రాలనంతగా జనం గుమిగూడారు. పూజా సామగ్రి ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. అరటి ఆకులు, పత్రి, అన్ని రకాల పండ్లు, కొబ్బరికాయలు, తమలపాకులకు బాగా డిమాండ్ ఏర్పడింది. దుర్గాబజార్, టీవీసీ పాయింట్, బాలాజీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం, చినగదిలి, పెదగదిలి ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో మార్కెట్‌కు వచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేశారు.

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలోని కూరగాయల మార్కెట్ కొనుగోలుదారులతో గురువారం కళకళలాడింది. శ్రావణ శుక్రవారం వ్రతానికి కావాల్సిన పువ్వులు, పండ్లు, కొబ్బరికాయల కొనుగోలు కోసం అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. దీంతో కళాభారతి రోడ్డు కిక్కిరిసిపోయింది. ఇదే అదనుగా వ్యాపారులు పండ్లతో పాటు, పువ్వులు, కొబ్బరికాయల ధరలను పెంచి విక్రయించారు.

అష్టలక్ష్మీల వేషధారణలో చిన్నారులు

ఎంవీపీ కాలనీ: వరలక్ష్మీ వ్రత వేడుకను పురస్కరించుకుని స్థానిక ఉషోదయ కూడలిలోని ఓ స్కూల్‌లో విద్యార్థులు అష్టలక్ష్మీల అలంకరణలో ఆకట్టుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవార్లను ప్రతిబింబిస్తూ అబ్బురపరిచారు.



ప్రత్యేక పూజలందుకున్న పోలమాంబ అమ్మవారు



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారుల సందడి



అష్టలక్ష్మీల అలంకరణలో ఆకట్టుకుంటున్న చిన్నారులు



పెదవాల్తేరు రైతుబజార్‌లో రద్దీగా పువ్వుల స్టాల్



రద్దీగా మద్దిలపాలెం కూరగాయల మార్కెట్

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

గోపాలపట్నం: పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని విశాఖ డీసీపీ జి.నాగన్న సిబ్బందిని ఆదేశించారు. గోపాలపట్నం క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలు అత్యధికంగా జరిగే ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, జీడీ ఎంట్రీ, తదితర రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సస్పెక్టడ్ నేరస్తులకు ప్రతీ ఆదివారం కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత, ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఫిర్యాదులు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. గోపాలపట్నం ఎస్ఐ నర్సింగరాజు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలకం

కూర్మన్నపాలెం: దేశ ప్రగతిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలక భాగస్వామ్యం పోషిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్–3లోను ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్యం ఉందని, అందుకే తక్కువ వ్యయంతో ఇంతటి విజయం సాధ్యమైందని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం 924వ రోజు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని, కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జైలులో వస్తువుల వేలం 30కి వాయిదా

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఉపయోగంలో లేని వస్తువులను జైలు అధికారులు వేలం వేయనున్నారు. ముందుగా ఈ వేలం ఈ నెల 26న జరగనున్నట్లు అధికారులు ప్రకటించారు.

కొన్ని కారణాల వల్ల ఈ వేలం ప్రక్రియను ఈనెల 30వ తేదీకి వాయిదా వేసినట్టు జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 94904 42272 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

మందుబాబులకు రూ.49 వేలు జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై న్యాయస్థానం కొరడా ఝుళిపించింది. వెయ్యి రూపాయల నుంచి రూ.10 వేలు వరకూ జరిమానాలు విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీకృష్ణ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన 13 మందిపై ఇటీవల కేసులు నమోదు చేసిన పోలీసులు గురువారం న్యాయస్థానంలో హాజరు పరిచారు. విచారించిన స్పెషల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు రూ.49 వేల జరిమానా విధించారు. మరో మారు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే జైలు శిక్ష తప్పదని ఎస్ఐ మురళీకృష్ణ హెచ్చరించారు.

పీఆర్‌టీయూ సమావేశం రేపు

అగనంపూడి: పీఆర్‌టీయూ పరవాడ మండల కమిటీ సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్. పెద్దినాయుడు తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయిలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించడంతో పాటు మండల కొత్త కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు.

నేడు సింహగిరిపై లక్ష కుంకుమార్చన

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులైన చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారికి తిరువీధి జరపనున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నేడు

కొమ్మాది: రుషికొండ శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు.